క్లుప్తంగా

సాక్షి గణపతి, జ్వాలా వీరభద్రుడికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థ బుధవారం సాయంత్రం సాక్షి గణపతికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేషపుష్పార్చన జరిపించారు.

పులుల సంరక్షణ అందరి బాధ్యత

మహానంది: పులుల సంరక్షణ అందరి బాధ్యత అని బండిఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాసిర్‌ఝా తెలిపారు. గ్లోబల్ టైగర్ డే సందర్భంగా స్థానిక కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులకు వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో పులుల సంరక్షణ కోసం 43 టైగర్ రిజర్వ్‌లు ఉన్నాయన్నారు. అందులో ఎన్‌ఎస్‌టీఆర్ అతిపెద్దదని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాక్షాయినీ, సిబ్బంది పాల్గొన్నారు.

కొలనుభారతి క్షేత్రంలో సరస్వతీ తత్వం


అమ్మవారికి మంగళహారతి ఇస్తున్న దృశ్యం


కొత్తపల్లి: మండల పరిధిలోని కొలనుభారతి క్షేత్రంలో బుధవారం శ్రీకాకుళం జిల్లాకు చెందిన నైమిశారణ్య పీఠాధిపతులు, హిందూ ధార్మిక సేవాసమితి అధ్యక్షుడు బాలబ్రహ్మానంద సరస్వతి సరస్వతీ తత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ పురోహితులు, ఈఓ మోహన్‌తో కలసి ఆలయ సంప్రాదాయానుసారంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. అనంతరం కొలనుభారతి క్షేత్రంలో హిందూ ధార్మిక ప్రవచనాలు, మతతత్వ బోధనలిచ్చారు.

దళితుల శ్మశానానికి భూదానం


తహసీల్దార్‌కు ఒప్పంద పత్రాన్ని అందజేస్తున్న లాయర్ సత్యనారాయణరెడ్డి

జూపాడుబంగ్లా: మండలంలోని 80బన్నూరు గ్రామానికి చెందిన దళితుల(మాదిగలు)శ్మశాన వాటిక కోసం 26సెంట్ల పట్టా భూమిని అందజేసిన లాయర్ సత్యనారాయణరెడ్డిని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, రెవెన్యూ సిబ్బంది ప్రశంసించారు. 80బన్నూరు గ్రామానికి చెందిన దళితులకు శ్మశానవాటిక స్థలం నేషనల్ హైవే 340సీ రోడ్డు నిర్మాణంలో పోతుంది. అందుకు ప్రత్యామ్నాయంగా తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ రెవెన్యూ సిబ్బంది సహకారంతో గ్రామంలో స్థలం కోసం అన్వేషించారు. కాగా, గ్రామానికి చెందిన లాయర్ సత్యనారాయణరెడ్డి సర్వేనెంబర్ 370లో ఉన్న రూ.7లక్షల విలువైన 0.26సెంట్ల స్థలాన్ని దళితులు(మాదిగలు) శ్మశానవాటిక కోసం ఉచితంగా ఇస్తానని ముందుకొచ్చి, ఒప్పంద పత్రాన్ని రాసి తహసీల్దార్‌కు అందజేశారు. సీనియర్ అసిస్టెంటు శ్రీరంగారెడ్డి, వీఆర్వోలు ఉన్నారు.

తిక్కస్వామి దర్గాలో బైరెడ్డి మల్లికార్జునరెడ్డి ఫాతెహాలు


తిక్కస్వామి దర్గా వద్ద పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు

పగిడ్యాల: మొహర్రం వేడుకలను పురస్కరించుకుని బుధవారం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ బైరెడ్డి మల్లికార్జునరెడ్డి, నందికొట్కూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తువ్వా శివరామకష్టారెడ్డి మండలంలోని పడమర వనుములపాడు తిక్కస్వామి దర్గాను దర్శించుకుని ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. కొలువుదీరిన పీర్లను దర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు మండ్లెం మధుసూదన్‌రెడ్డి, పాత ముచ్చుమర్రి సర్పంచ్ పెద్ద ఆంజనేయులు, మాజీ సర్పంచ్ మద్దిలేటి, నాయకులు నాగశేనారెడ్డి, శ్రీనువాసులురెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్‌బీకేల తనిఖీ

కొత్తపల్లి: గ్రామాలలోని రైతులు రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు ఏడీఏ బి.ఆంజనేయ సూచించారు. బుధవారం దుద్యాల గ్రామంలోని ఆర్‌బీకే, సచివాలయాలను తనిఖీ చేశారు. సర్పంచు చంద మాల శోభలత ఆధ్వర్యంలో రైతులతో ముఖాముఖీ నిర్వహించారు. రైతులకు వ్యవసాయ సంబంధ పథకాలను వివరించారు.

గోడ కూలి బర్రెలకు గాయాలు

మహానంది: గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో బొల్లవరంలో కాశన్న ఇంటి వద్ద ఉన్న గోడ కూలి పక్కనే ఉన్న మూడు బర్రెలపై పడటంతో వాటికి గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న పశు సంవర్ధకశాఖ వీఎల్‌ఓ సులోచన, సిబ్బంది గ్రామానికి చేరుకుని వర్షంలోనే వాటికి వైద్యసేవలు అందించారు.

ఎడతెరిపిలేని వాన

- డివిజన్ పరిధిలో విస్తారంగా వర్షాలు
- పొంగి ప్రవహిస్తున్న వాగులు
- నీట మునిగిన పంట పొలాలు


ఆత్మకూరు వద్ద మొక్కజొన్న పొలంలో నిలిచిన వర్షపు నీరు


బండిఆత్మకూరు మండలంలో వరిని ముంచేసిన వర్షపునీరు

ఆత్మకూరు: తుపాన్ ప్రభావం వల్ల ఆత్మకూరు డివిజన్ పరిధిలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. ఆత్మకూరు మండలంలో రెవెన్యూ అధికారుల సమాచారం మేరకు 21.2మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. ఈ వర్షాలకు మండలంలోని భవనాశి, సుద్దవాగులే కాకుండా నల్లమల అటవీ పరిధిలో భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షాలు భారీగా కురవడంతో మొక్కజొన్న రైతులు ఆందోళన చెందుతున్నారు.

జలమయమైన లోతట్టు కాలనీలు

మహానంది: మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో జోరువానతో లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. బండిఆత్మకూరు మండలంలో 36.0మిమీ, మహానంది మండలంలో 35.4మిమీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా నల్లమలలో భారీవర్షం కురవడంతో బండిఆత్మకూరు మండలంలోని ఓంకారం పుణ్యక్షేత్రం సమీపంలో తెలుగుగంగ కాల్వలోని భారీగా వర్షపునీరు చేరడంతో సమీపంలోని పంటపొలాలు నీటమునిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నల్లమల నీరంతా గంగలోకి రావడంతో గంగమ్మ ఉబికి వస్తుందని చెప్పారు. వీవర్స్‌కాలనీలో వర్షపునీరు రోడ్డుపైకి రావడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పద్దారు. గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలో వర్షపునీరు ఇళ్లలోకి చేరింది.

నందికొట్కూరు నియోజకవర్గంలో భారీ వర్షం

నందికొట్కూరు: నియోజకవర్గంలో ఎడతెరిపి లేకుండా నాలుగు రోజుల నుంచి వర్షం కురుస్తోంది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు నిండిపోయాయి. దామగట్ల చెరువు నీటితో కళకళాడుతోంది.

చెరువులను తలపిస్తున్న పొలాలు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలో 26.8 మి.మీల వర్షపాతం నమోదయ్యింది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. పంటచేలలో నిలిచి నీటిని చెల నుంచి బయటికి పంపేందుకు రైతన్నలు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ వర్షాల దాటికి వాగులు, వంకలు, పంట కాల్వలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ వర్షం వరి సాగుకు అవసరమైన, ఆరుతడిపంటలు దెబ్బతింటాయోమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. నల్లమల అటవీ ప్రాంతం నుంచి రాయిసెల, జౌకు, గౌరిసెల కాల్వలు పరవళ్లు తొక్కుతున్నాయి. నల్లమల అటవీ ప్రాంతంలో ప్రతిరోజు వర్షం కురుస్తుండడంతో శివభాష్యం సాగర్ ప్రాజెక్టుకు జలకళ సంతరించుకుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 370 మీటర్లు కాగా ఇప్పటికే 368 మీటర్లకు చేరిందని నీటిపారుదల శాఖ ఏఈ నాగన్న తెలిపారు.

అన్నదాత ఆందోళన

జూపాడుబంగ్లా: గత ఆరు రోజుల నుంచి ఎడతెరపిలేకుండా వర్షాలు కురుస్తుండటంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటపొలాల్లో నీళ్లు నిలిస్తే పంటలు దెబ్బతింటాయని రైతులు పేర్కొంటున్నారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో కురిసిన వర్షం 36.6మిల్లీమీటర్లుగా నమోదైనట్లు ఏఎస్‌ఓ హనుమంతు తెలిపారు.

చెక్‌డ్యాంలు, చెరువులకు జలకళ

మిడుతూరు: మండలకేంద్రమైన మిడుతూరుతోపాటు పలు గ్రామాల్లో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. మండలంలోని కాకిలేరు వాగు, చెక్‌డ్యాంలు, చెరువులకు జలకళ సంతరించుకుంది. బోరు బావుల కింద సాగు చేపట్టిన మొక్కజొన్న, ఉల్లి, మిరప తదితర పంటలకు అనువుగా ఉంటుంది.

ఉధృతంగా భవనాశి వాగు

పాములపాడు: ఎడతెరిపి లేని వర్షాలతో మండలంలోని వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కురిసిన వర్షం 24.6మిల్లీ మీటర్లుగా నమోదైంది. మండలంలోని ఇస్కాల గ్రామ సమీపంలోని భవనాశి వాగు ఉధృతంగా ప్రవహించడంతో నందీశ్వరాలయం నీట మునిగింది. ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే చెలిమిల్ల గ్రామ సమీపంలోని సుద్దవాగు, బానుముక్కల గ్రామ సమీపంలోలోని ఎర్రవాగులు ప్రవాహంతో పక్కనున్న పొలాల్లోకి నీరు చేరి పంటలు మునిగిపోయాయి. వ్యవసాయ బావులు నిండి నేలకు సమాంతరంగా కనిపిస్తున్నాయి. మిట్టకందాల గ్రామంలో గూడుబి అనే వ్యక్తి మటి మిద్దెపై కప్పు కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేకపోవడం తో ప్రమాదం తప్పింది. అదే గ్రామంలో సయ్యద్ బాషా, చాంద్‌బాషా, మున్నా లకు చెందిన మూడు గృహాల పైకప్పులు కూలాయి.

పగిడ్యాల: వర్షాలకు నల్లవాగు కాలువ ఉప్పొంగి ప్రవహిస్తోంది. బుధవారం మండల వ్యాప్తంగా 30.8 మీ.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో బావులు, బోర్లకు భూగర్భ జలాలు పెరుగుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. లోతట్టు పొలాల్లో వర్షపు నీరు నిలువడం వలన దిగువకు తెంపి నల్లవాగు కాలువకు మళ్లీస్తున్నారు.


గువ్వలకుంట్ల వద్ద పొలంలో నిలిచిన వర్షపు నీరు


చెలిమిల్ల వద్ద నేలకు సమాంతరంగా బావి


గువ్వలకుంట్ల సమీపంలో పొలంలో నుంచి నీటిని బయటికి పంపిస్తున్న రైతన్నలు


ఉప్పొంగి ప్రవహిస్తున్న శివభాష్యం సాగర్ కాల్వ

జీఎల్‌జీ గ్రూపులకు రూ. 1.20 కోట్ల రుణాలు


ఎస్వీ విజయమనోహరిని మర్యాదపూర్వకంగా కలిసిన నందిరెడ్డిగారి వెంకటేశ్వరమ్మ

వెలుగోడు: ఈ నెల 29న జేఎల్‌జీ (జాయింట్ లాయబిలిటీ) గ్రూపులకు వ్యవసాయ అనుబంధ రుణాలు రూ.1.20 కోట్లు అందిస్తున్నట్లు కేడీసీసీ డైరెక్టర్ నందిరెడ్డిగారి వెంకటేశ్వరమ్మ తెలిపారు. కేడీసీసీ బ్యాంకు నూతన చైర్‌పర్సన్ గా నియమితులైన ఎస్వీ విజయ మనోహరిని బుధవారం వెంకటేశ్వరమ్మ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. వెంకటేశ్వరమ్మ విలేకరులతో మాట్లాడుతూ .. గతంలో రైతులకు రుణాలు ఇవ్వడం, రికవరీలకే డీసీసీబీ పరిమితమైందని, నేడు రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజల ఆర్థిక అభ్యున్నతికి బ్యాంకు దోహదపడుతోందన్నారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సహకారంతో జేఎల్‌జీ గ్రూపులకు ఈ నెల 29న వేల్పనూరు గ్రామంలో నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమంలో కోటి 20 లక్షల రుణాలు మహిళలకు అందిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఆమె వెంట నందిరెడ్డిగారి రామిరెడ్డి ఉన్నారు.

మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వెలుగోడు: మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి పవన్‌కుమార్ సూచించారు. మండలంలో రైతులు సాగుచేసిన మొక్కజొన్న పైర్లను బుధవారం పరిశీలించారు. జూలై మాసానికి సాధారణ వర్షపాతం 170 మి.మీ. ఉండగా ఇప్పటికే 198మి.మీ వర్షపాతం నమోదు అయినట్లు ఏవో తెలిపారు. మండలంలో మొక్కజొన్న పంట 250 హెక్టార్లు, సోయాబీన్ 73 హెక్టార్లు సాగు చేశారని, ప్రస్తుతం మొక్కజొన్న 20 రోజుల నుంచి కండె గట్టిపడే దశలో ఉందన్నారు. మొక్కజొన్న అధిక తేమను తట్టుకోదు. సాధ్యమైనంత వరకు త్వరగా పొలంలో నీటిని తీసివేయాలని సూచించారు. మొక్కజొన్నకు ఎకరాకు 25 కిలోల నత్రజని, 10 కిలోల పొటాష్‌లనిచ్చే ఎరువులు వేయాలి. ప్రస్తుతం మొక్కల ఎత్తు దశలో ఉన్న మొక్కజొన్నలో కాండం తొలిచే పురుగు ఆశించే అవకాశం ఉందని, నివారణకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు సుడుల్లో వేయాలని సూచించారు. ఆగస్టు, సెప్టెంబర్ వరకు వర్షాలు కురిసే అవకాశం ఉంది. చేలల్లో నీరు నిల్వ ఉండగా ముందస్తుగానే కాల్వలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి

నందికొట్కూరు రూరల్: మండలంలోని సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని మండల ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారించుకోవాలని సూచించారు. పలువురు ప్రజాప్రతినిధులు తమ పరిధిలోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. సర్వసభ్య సమావేశాలకు విద్యుత్ ఏఈ హాజరు కాకుండా ఇతర అధికారులను పంపిస్తుండటంతో ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో శోభారాణి, తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, వైస్ ఎంపీపీ పబ్బతి జ్యోతి, ఎంపీటీసీలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని నంద్యాల రోడ్డులో ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో 12వ సచివాలయ జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కిషోర్‌తో కలిసి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ నెల 1వ తేదీన ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమం పట్టణంలో విజయవంతంగా ముగిసింది. చైర్మన్ మాట్లాడుతూ జగనన్న సురక్ష స్ఫూర్తితో మెరుగైన సేవలు అందించడం జరిగిందన్నారు. వలంటీర్లు చిత్తశుద్ధితో పని చేయడంతోనే 7,500 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేయడం సాధ్యమైందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్యామలాదేవి, డీటీ కిషోర్, సచివాలయాల జేసీఎస్ కన్వీనర్ అబుబక్కర్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ వైద్యుడు, ఉద్యోగులకు సన్మానం

నందికొట్కూరు: వైద్యులు, వైద్య సిబ్బంది అందించిన సేవలు మరవలేనివని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంబాబు అన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో పని చేస్తూ బదిలీపై వెళ్లిన డాక్టర్లు ఏఎస్ రాయుడు, ప్రసాద్, ల్యాబ్ టెక్నిషియన్ సత్యనారాయణ, నరేష్‌కు బుధవారం వైద్యులు, నవనంది కరస్పాండెంట్ శ్రీధర్, జవ్వాజి సుంకన్న గౌడు సేవా సమితి అధ్యక్షులు శ్రీకాంత్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెడ్ నర్సు భువనేశ్వరి, రేడియోగ్రాఫర్ నవీన్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వంద రోజులు పని కల్పించాలి

మహానంది: ఉపాధి హామీ పథకంలో భాగంగా అర్హులందరికీ వందరోజులు పని కల్పించాలని ఏపీఓ వసుధ తెలిపారు. బుధవారం బండిఆత్మకూరులోని కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉద్యాన, అవెన్యూ ప్లాంటేషన్, హౌసింగ్ విభాగాల పనులపై సిబ్బంది శ్రద్ధ చూపుతూ కనీస వేతనం కూలీలకు అందేలా చూడాలన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో సమస్యను వివరిస్తున్న ఎంపీటీసీ

వెలుగోడు: వర్షాకాలంలో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ లాలం రమేష్ అన్నారు. బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో దోమల లార్వా పెరిగే ప్రమాదం ఉన్నందున మలేరియా, డెంగీ లాంటి ప్రమాదకరమైన జ్వరాల బారిన ప్రజలు పడకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోగ నిర్ధారణ కొరకు సత్వరమే జ్వర పరీక్షలు చేసి రిపోర్టులను ఉన్నతాధికారులకు అందజేసి, అవసరమైన రోగికి వైద్యం అందేలా సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. అధిక వర్షాలకు ఇళ్లలోకి, పంట పొలాల్లోకి నీరు చేరే అవకాశం ఉంటుందని, నీటిని దిగువకు పంపించే ఏర్పాట్లు ఎప్పటికప్పుడు చేసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీవో షేక్ అమానుల్లా, తహసీల్దార్ నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీలు చికెన్ బాబు, శంకర్ నాయక్, సర్పంచ్ వేల్పుల జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి కృషి

- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- నాడు–నేడుతో ఆసుపత్రికి నూతన భవనం
- త్వరలోనే ప్రారంభం


ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి కేక్ తినిపిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల మరింత అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. బుధవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని వైద్యశాలను నాడు– నేడు నిధులతో నూతన ఆసుపత్రి భవనాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం వైద్యం కోసం పెద్దెత్తున కృషి చేస్తుందని, ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగుల పట్ల అదే స్థాయిలో వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రోగుల పట్ల నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, కోత్తపల్లి, పాములపాడు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో నిరుపేదలు ప్రభుత్వ వైద్యశాలలకు వస్తున్నారని, వారి నుంచి ఫిర్యాలు వస్తే సిబ్బందిని తొలగిస్తామని, 24 గంటలు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకు మునుపు ప్రభుత్వ వైద్యశాల నూతన భవనాన్ని పరిశీలించారు. త్వరలో భవనాన్ని ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల కమిటీ సభ్యులు మున్సిపల్ చైర్ పర్సన్ ఆసియా మారుఫ్, సభ్యులు డాక్టర్ నాగన్న, ఏఓ మోహన్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్ విజయ్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో పార్కు ఏర్పాటు చేస్తాం

పట్టణంలో నూతన పార్కును ఏర్పాటు చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరనాన్ని కల్పిస్తామని ఎమ్మెల్యే అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పార్కు స్థలం కోసం ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలోని ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్‌తో పాటు ఇతర ప్రాంతాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. నూతన మున్సిపల్ కార్యాలయం నిర్మాణంతో పాటు పట్టణంలోని వివిధ కాలనీల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని సూచించారు. సభ్యులు సమావేశంలో అజెండాలోని ఆరు అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం ఎమ్మెల్యే ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సిబ్బంది కేక్ కట్ చేయించి దుశ్శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు రషీద్ తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్ధారణ వైద్య సేవల వాహనం ప్రారంభం

పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉచిత క్షయ వ్యాధి నిర్ధారణ సంచార వైద్యసేవల వాహనాన్ని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రారంభించారు. డివిజన్‌లో సేవా భారతి ఆధ్వర్యంలో టీబీ రోగులను గుర్తించి వారికి వైద్య పరీక్షలు అందజేసేందుకు ఈ వాహనాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.చెంచు గిరిజనుల గూడేలకు ఈ వాహనం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్త్యాలమ్మ, మార్కెట్‌యార్డు చైర్మన్‌నాగన్న, సూపర్‌వైజర్లు, మస్తాన్, రవి తదితరులు పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు అధిక రుణాలు ఇవ్వాలి

ఆత్మకూరు: మండలంలోని అన్ని పొదుపు మహిళా సంఘాలకు అధిక మొత్తంలో బ్యాంకు రుణాలు ఇవ్వాలని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి సూచించారు. పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో బుధవారం రాత్రి బ్యాంకు, మెప్మా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా మహిళలకు రుణాలు ఇచ్చే విషయంలో పొదుపు మహిళలు ఫిర్యాదులు చేస్తున్నారని, ప్రధానంగా చాలా గ్రూపులకు రుణాలు సక్రమంగా ఇవ్వడం లేదనే తన దృష్టికి వచ్చిందన్నారు. బ్యాంకు అధికారులు సమాయత్తమై అన్ని గ్రూపులకు రుణాలు ఇవ్వాలన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మిడుతూరు: మండల పరిధిలోని కడుమూరు గ్రామానికి చెందిన సురేష్ బుధవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన శ్రీనివాసులు, రాజేశ్వరి దంపతుల రెండో కుమారుడు సురేష్ పురుగు మందు తాగడంతో కుటుంబసభ్యులు గమనించి స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి 108లో తరలించారు. కాగా ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

బంగారు ఉంగరం అప్పగింత

మహానంది: మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన భక్తుడు బాలాజీ పోగొట్టుకున్న బంగారు ఉంగరాన్ని తిరిగి అప్పగించారు. బుధవారం బాలాజీ, మిత్రులు కోనేరులో స్నానం చేస్తుండగా ఉంగరం పడిపోగా, గుర్తించిన ఆయన ఆలయ సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్థానికుల చేత వెతికించి ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో బాధిత భక్తుడికి అందించారు.

కంట్రోల్ రూం ఏర్పాటు


కొత్తపల్లి: భారీ వర్షాల దృష్ట్యా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ బుధవారం తెలిపారు. మూడు రోజుల పాటు 24 గంటలు కంట్రోల్‌రూం పనిచేస్తుందన్నారు. ఆర్‌ఐ పర్యవేక్షణలో ప్రతిరోజు షిఫ్టుల వారీగా ముగ్గురు వీఆర్వోలు, వీఆర్‌ఏలు అందుబాటులో ఉంటారన్నారు. గ్రామాల్లో వర్షాల కారణంగా ఇళ్లు, గుడిసెలు, ఇతర ఏదైన ప్రమాదం సంభవిస్తే వీఆర్వోలకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

జూపాడుబంగ్లా: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విపత్కర కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ తెలపారు. ఏదేని ప్రమాదం నెలకొంటే సెల్: 8919257959 కి ఫోన్‌చేసి సమాచారం అందించాలని సూచించారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

పాములపాడు/మహానంది: వర్షాల కారణంగా విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఏడీఈ వసంతయ్య, ఏఈ అబ్దుల్ హఫీజ్, మహానంది, బండిఆత్మకూరు ఏఈలు ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి సూచించారు. తడి చేతులతో విద్యుత్ బోర్డులో స్విచ్‌లు ఆన్‌చేయరాదన్నారు. ఇంట్లో అతుకుల విద్యుత్ తీగలు ఉంటే ఎలక్ట్రీషియన్‌తో మార్పించుకోవాలని పేర్కొన్నారు.

సర్వసభ్య సమావేశంలో సమస్యలపై ఏకరువు


మాట్లాడుతున్న ఎంపీడీఓ జీఎన్‌ఎస్‌రెడ్డి

మిడుతూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ఏ కరువు పెట్టారు. తలముడిపి గ్రామంలో నిర్వహించిన ఉపాధి హామీ పథకం అమలు విచారణ అనంతరం నిర్వహించిన గ్రామ సచివాలయ వద్ద జరిగిన సంఘటన విషయమై దళిత సర్పంచ్‌నైన తన పట్ల అమానుషంగా ప్రవర్తించారని, ఈ విషయంలో ఎంపీడీఓ, ఎంపీపీ నాయకులు కనీసం పరామర్శించకపోవడం బాధాకరమని తలముడిపి సర్పంచ్ వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ, సహకార సొసైటీ చైర్మన్ నాగతులసి రెడ్డి స్పందిస్తూ జరిగిన ఘటనపై కేసు నమోదు చేయాలని శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారని, స్పందించలేదని అనడం సరికాదన్నారు. ఇదే విషయమై ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి ఉద్యోగానికి లోనై ఏ ఒక్కరి పట్ల వివక్షత చూపలేదని, అలాంటి మనస్తత్వం తనది కాదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రకాష్‌బాబు, పీఆర్ డీఈ ధనిబాబు, ఎంఈఓ శ్రీనాథ్, వైస్ ఎంపీపీ నబిరసూల్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు .

భక్తిశ్రద్ధలతో చిన్న సరిగెత్తు


తాటిపాడులో అలీ, అక్బర్ పీర్ల ఊరేగింపు

పగిడ్యాల: మండలంలోని పీకే ప్రాగటూరు, నెహ్రూనగర్, తూర్పు, పడమర వనుములపాడు, సంకిరేణిపల్లె తదితర గ్రామాల్లో బుధవారం నుంచి మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో పీర్లచావిడీలు భక్తుల సందడితో కళకళలాడాయి. తూర్పు, పడమర గ్రామాల్లోని తిక్కస్వామి పీరుకు భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు జెండాలు ఎక్కించి మేళతాళాలు, తప్పెట్ల సందడితో పూల దట్టీలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అంగరంగ వైభవంగా చిన్న సరిగెత్తు వేడుకలను నిర్వహించారు.

జూపాడుబంగ్లా : తాటిపాడు గ్రామంలో బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో చిన్నసరిగెత్తు వేడుకలు నిర్వహించారు. పీర్లను ఎత్తేవారిని భాజాభజంత్రీలతో పీర్ల చావిడి వద్దకు తీలుకొచ్చారు. వారు పీర్లదేవుళ్లకు టెంకాయలు సమర్పించి పూనకం పూనారు. అలీ, అక్బర్ పీర్లను ఎత్తుకొని గ్రామంలోని దర్గా వద్ద ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు.

మహానంది: మొహర్రం వేడుకల్లో భాగంగా బుధవారం చిన్నసరిగెత్తు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గాజులపల్లె, తిమ్మాపురం, అబ్బీపురం, బుక్కాపురం, తమ్మడపల్లె, బొల్లవరం తదితర గ్రామాల్లో వేడుకలు వైభవంగా చేపట్టారు. బండిఆత్మకూరు మండలంలోని వివిధ గ్రామాల్లో మఖానాల వద్ద సందడి కనిపించింది. భక్తులు వర్షాన్ని లెక్కచేయకుండా భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

ప్రతిభా పాఠశాల విద్యార్థులకు సత్కారం


విద్యార్థులను సత్కరిస్తున్న ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి

శ్రీశైలం ప్రాజెక్టు : గిరిజన సాంస్కృతిక పరిశోధన సంస్థ, ట్రైనింగ్ మిషన్ ఈనెల 22వ తేదీన విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి గిరిజన పెయింటింగ్స్, ఆర్ట్ పోటీలలో శ్రీశైలం గురుకుల ప్రతిభా పాఠశాల విద్యార్థులు మొదటి బహుమతిని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో పీఓ డాక్టర్ బి.రవీంద్రా రెడ్డి విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో ఏపీఓ పి.మురళీధర్, కళాశాల ప్రిన్సిపల్ కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.